క్లుప్తంగా

గురుకులాల ప్రక్షాళన హర్షదాయకం

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీ గురుకులాల ప్రక్షాళన హర్షదాయకమని.. కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి ఆయేషా మస్రత్‌ఖానంను నియామకం చేయడం స్వాగతనీయమని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మైనార్టీ గురుకుల రాష్ట్ర కార్యాలయం కేంద్రంగా ఔట్‌సోర్సింగ్స్ ఉద్యోగాల నియామకాల విషయంలో అనేక అవినీతి, అక్రమాలకు తెరలేపారని పేర్కొన్నారు.

పరామర్శ

అడ్డాకుల: కందూర్‌కి చెందిన మహ్మద్ ఖతాల్ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ గురువారం పరామర్శించారు. ఖతాల్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉప సర్పంచ్ శంకర్, గొల్ల బుడ్డన్న, వెంకటయ్య, రాములు తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చిన్నచింతకుంట: తెలుగు దేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర ఇన్‌చార్జ్ బక్కని నర్సింహులు పిలుపునిచ్చారు. గురువారం తిర్మలాపురంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనార్దన్, మండల అధ్యక్షుడు రవికుమార్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాలప్ప, మైనార్టీ జిల్లా ప్రెసిడెంట్ షబీర్‌పాష పాల్గొన్నారు.

వీగిపోయిన అవిశ్వాసం

మిడ్జిల్: వైస్‌ఎంపీపీపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవిశ్వాసం వీగిపోయింది. బలప్రదర్శనలో సరైన కోరం లేని కారణంగా అవిశ్వాసం విగిపోయినట్లు ఆర్డీఓ అనిల్‌కుమార్ తెలిపారు. మొత్తం 9మంది ఎంపీటీసీలు ఉండగా అవిశ్వాసం నెగ్గాలంటే ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం ఉంటుందన్నారు. ఐదు మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో దివ్యాంగ యాచకుడు మృతి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి వనపర్తి జిల్లా గోపాల్‌పేట ప్రాంతానికి చెందిన దివ్యాంగ యాచకుడు నిద్రిస్తూనే సహజ మరణం పొందిన ఘటన చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ గురువారం వివరాలు తెలియజేశారు. నిద్రిస్తున్న చోటే మృతిచెంది ఉండటాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. మృతదేహాన్ని వారికి అప్పగించి కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



గురుకుంటలో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎంపీడీఓ జ్యోతి అన్నారు. గురువారం మండల పరిధిలోని దివిటిపల్లి, అల్లీపూర్ గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారంటీల లబ్ధి కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని అన్నారు. వైస్ ఎంపీపీ అనిత, సర్పంచ్‌లు జరీనాబేగం, ఆంజనేయులు, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. పోతన్‌పల్లి, కోటకదిరల్లో తహసీల్దార్ సుందర్‌రాజ్ పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌లు సత్యమ్మ, మల్లు రమ్య, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో గురువారం 23, 24, 25, 26 వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించగా ఆరు గ్యారంటీల కోసం మొత్తం 2,542 దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకు మొత్తం 12,549 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ మహమూద్‌షేక్ వెల్లడించారు. ఇక గ్రామాల విషయానికి వస్తే గురువారం పోచమ్మగడ్డతండా, కొత్తతండా, లింగంపేట, గోప్లాపూర్, ఈర్లపల్లి, మల్రిచెట్టుతండాల్లో గ్రామసభలు నిర్వహించారు. మొత్తం 1,600ల దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకు ప్రజాపాలనలో మొత్తం 11,046 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేశారు.

అడ్డాకుల: సుంకరామయ్యపల్లిలో తహసీల్దార్ ఘన్సీరాం ఆధ్వర్యంలో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. 165 దరఖాస్తులు అందినట్లు సూపరింటెండెంట్ శివప్రసాద్ తెలిపారు. మూసాపేట మండలం సంకలమద్దిలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు శెట్టిశేఖర్, ఎంపీటీసీ సంతోషి, మాజీ ఎంపీటీసీ అంజనేయులు, మూసాపేట ఉప సర్పంచ్ తాజోద్దీన్ తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ప్రజాపాలన కార్యక్రమంలో 2,243 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజలు ఇబ్బంది పడకుండా 14 వార్డులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. పథకాల కోసం 1,770 మంది, రేషన్ కార్డుల కోసం 473 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, సూపరిండెంట్ శ్రీనివాసరావు, సర్పంచ్ విజయలక్ష్మి, ఈఓ సీత్యానాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



దేవరకద్రలో..

నవాబుపేట: అర్హులైన ప్రతి వ్యక్తి నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించాలని.. అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని గ్రామాల్లో వంద శాతం పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ రవినాయక్ సూచించారు. గురువారం ఆయన గురుకుంటలో కొనసాగుతున్న ప్రజాపాలన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విధానంపై ఆరాతీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా ప్రతి మారుమూల పల్లెలో ఉన్న వారందరికీ దరఖాస్తులు అందేలా చూడాలని... వారికి కావాల్సిన పథకాలపై దరఖాస్తుల స్వీకరణ జరగాలన్నారు. గ్రామాల్లో దరఖాస్తుల కొరత విషయం వినిపిస్తుందని అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని.. ప్రతి దరఖాస్తుకు నంబర్ వేయాలని, నమోదు సైతం పకడ్బందీగా జరగాలన్నారు. ఎంపీడీఓ శ్రీలత, వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

6 రోజుల్లో 49,524 దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'ప్రజాపాలన'లో భాగంగా ఆరు రోజుల్లో ఇప్పటివరకు పట్టణంలోని 48 వార్డులకు గాను మొత్తం 49,524 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో 'అభయహస్తం'వి 47,221, ఇతర సమస్యలపై 2,303 ఉన్నాయి. వీటిలో గురువారం ఒక్కరోజే 11,446 వచ్చాయి. 28వ వార్డులోని బండ్లగేరి, 39వ వార్డులోని రాజేంద్రనగర్‌లో నిర్వహించిన 'ప్రజాపాలన'ను మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఇక మిగిలిన 31వ వార్డులోని ఖైసర్ కమ్యూనిటీ హాలు (మక్కామసీదు రోడ్) లో శుక్రవారం కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఏర్పాట్లపై కలెక్టర్ అసంతృప్తి

బాలానగర్: ఈదమ్మగడ్డ తండాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ రవి నాయక్ పరిశీలించారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకునేందుకు ఏర్పాట్లు సరిగా చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి విజయలక్ష్మికి షోకాజ్ నోటీస్ జారీచేయాలని ఆదేశించారు. ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి బాబురావు, ఎంపీడీఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: మండల పరిధిలో గురువారం మొత్తం 1860 దరఖాస్తులు వచ్చాయి. పెద్దవార్వాల్, పగిడ్యాల్, సాలార్‌నగర్ తదితర గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది.



మూసాపేట మండలం సంకలమద్దిలో ..



కోటకదిరలో ..



జిల్లాకేంద్రంలోని 28వ వార్డులో..

విద్యార్థులకు ప్రేరణ తరగతులు



హన్వాడ: మండల పరిధిలోని చిన్నదర్పల్లి జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఎస్వీఎస్ మెడికల్ కళాశాల డైరెక్టర్ రాంరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. పరీక్షల్లో విజయం సాధించేందుకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రాబోయే పరీక్షల్లో ఉన్నతంగా రాణించాలని, చక్కగా చదివి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. రాంరెడ్డి విద్యార్థులకు డిక్షనరీలను అందించారు. హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు



నవాబుపేట: మండల కాంగ్రెస్ నాయకులు గురువారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకులను పేరు పేరునా పలకరించారు. అదేవిధంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారితో వివిధ అంశాల గురించి వివరించారు. మండల నాయకులతో పాటు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఆయన సోదరుడు దుశ్యంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల వద్దకే పాలన



దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం కొకుంట్ల, ముచ్చింతల గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనకు హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన దిశగా కృషి చేస్తున్నాడన్నారు. అందుకోసమే ప్రజాపాలన చేపట్టారన్నారు. ఆరుగ్యారంటీలకు దరఖాస్తు చేసుకుంటున్న వారికి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు అరవింద్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్‌మెంబర్ మహిమూద్, మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ సి.కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసి తీరుతాం



గండేడ్: గ్రామాల్లో అర్హులయిన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పగిడ్యాల్, పెద్దవార్వాల్, సాలార్‌నగర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందని అన్నారు. గ్రామాల్లో ఇల్లు లేని పేదలు ఎంతోమంది ఉన్నారని అలాంటి వారిని విస్మరించి గూడు లేకుండా చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని విమర్శించారు. రాజకీయాలకతీకతంగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తహసీల్దార్ నాగలక్ష్మి, జితేందర్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధే ప్రధాని లక్ష్యం

మిడ్జిల్: భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. గురువారం కంచన్‌పల్లిలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు మిథున్‌రెడ్డి, తిరుపతి, లాలు, సాహితి రెడ్డి, శేఖర్, వాసుదేవ్, మహేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

ఎంబీఏ పరీక్ష ఫీజులు తగ్గించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనిర్సిటీ పరిధిలో ఎంబీఏ ఫీజులు తగ్గించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు ఉండడం వల్ల విద్యార్థులు చెల్లించే పరిస్థితి లేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, శ్రీధర్, సృజన, జైపాల్, నీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



దామరగిద్ద: ప్రభుత్వం పేదలకు మెరుగైన ఆరోగ్యసేవలను అందించేందుకు సీఎంఆర్ ద్వారా భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. దామరగిద్దకు చెందిన వడ్ల కన్కప్ప కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా మెరుగైన వైద్యం కోసం గురువారం సీఎం సహాయనిధి ద్వారా మంజూరు చేసిన రూ. 2.5 లక్షల ఎల్ఓసీని ఆమె బాధిత కుటుంబానికి అందజేశారు. కన్కప్ప కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న సర్పంచ్ సత్యమ్మ

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్‌కి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.భవానికి గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో భవాని పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లాల్సి ఉండటంతో ఖర్చుల నిమిత్తం గ్రామస్తులు గురువారం రూ.18,500లను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ చేతుల మీదుగా అందజేయించారు. అదేవిధంగా పాటల పోటీలు, ఎన్‌సీఎస్‌సీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న మరో ముగ్గురు విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.వేయి అందజేశారు.

అభివృద్ధి పథంలో చిన్నరేవల్లి



నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం

- ప్రత్యేక మండలం ఏర్పాటే లక్ష్యంగా పనులు

బాలానగర్: మండలపరిధిలోని చిన్నరేవల్లిలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ప్రత్యేక మండల ఏర్పాటే లక్ష్యంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అన్ని రకాల హంగులతో వివిధ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. మరో గ్రామానికి మంజూరైన రైతువేదికను ప్రత్యేక శ్రద్ధతో గ్రామంలోనే పనులలో రాజీ పడకుండా అన్ని వసతులతో రూ. 25 లక్షలతో పూర్తి చేశారు. రూ. 10 లక్షలతో అంతర్గత మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేశారు. రూ. 40 లక్షలకు పైగా నిధులతో ప్రతి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ. 33 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాల భవనం నిర్మాణం చేపట్టి.. భవిష్యత్‌లో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అనుగుణంగా తీర్చిదిద్దారు. రూ. 1.5 లక్షలతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు, రూ. 12.5 లక్షలతో శ్మశాన వాటిక నిర్మాణం, రూ. 2.4 లక్షలతో డంపింగ్ యార్డు నిర్మాణం పూర్తి చేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఎవరికైనా ఆరోగ్య సంబంధ సమస్యలు తలెత్తినప్పుడు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలోనే రూ. 20 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్ర నిర్మాణం చేశారు.



గామ సభ వేదిక

సుమారు రూ. 28 లక్షలతో భవిష్యత్తుకు ఉపయోగపడేలా మరో ఫ్లోర్ నిర్మాణానికి అనుగుణంగా మెట్లతో అదనపు గదులతో గ్రామ సచివాలయ భవనం నిర్మాణం, మండలంలో ఎక్కడా లేని విధంగా రూ. 2.5 లక్షలతో రచ్చబండ వేదిక నిర్మాణం చేశారు. ఇక్కడ ఎంతో పురాతనమైన శివాలయాన్ని సుమారు రూ. 60లక్షలతో దాతల సహకారంతో తీర్చిదిద్దారు. విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. గ్రామంలో గతంలో పందుల బెడద విపరీతంగా ఉండేది. దీంతో సమస్య పరిష్కారం కోసం గ్రామంలోనే ఉపయోగంలో లేని ప్రభుత్వ భూమిలో ప్రత్యేక దొడ్డి ఏర్పాటుకు అనుమతి ఇవ్వగా వాటిని అక్కడకు తరలించారు.

ఇతర గ్రామాలకు ఆదర్శంగా..

చిన్నరేవల్లి అభివృద్ధి విషయంలో మండలానికే ఆదర్శంగా సాగుతోంది. మండల పరిధిలోని ఇతర గ్రామాల్లో ఎక్కడా లేని విధంగా గ్రామంలో దాదాపు అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేశారు. దాదాపు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. ప్రభుత్వం గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలి.

– బైండ్ల రమేష్, గ్రామస్తుడు

ఇబ్బందులు తొలగుతాయి

మా గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకున్నాం. సర్పంచ్ లక్ష్మి, ఆమె భర్త చంద్రమౌళి తదితరులు శ్రమించారు. మాగ్రామానికి 14 కిలోమీటర్ల దూరం ఉన్న బాలానగర్‌కు వెళ్లి పనులు చేసుకోవాలంటే ఒక రోజు గడిచిపోతుంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. అందువల్ల గ్రామాన్ని మండల కేంద్రం చేస్తే బాగుంటుంది. ఇబ్బందులు తొలగుతాయి.

– శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తుడు

మండల కేంద్రం చేయాలి



ఎంతో కష్టపడి అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. భవిష్యత్తు అవసరాలకు తగిన రీతిలో తీర్చిదిద్దుకున్నాం. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు భూములు ఉన్నాయి. చిన్నరేవల్లిని మండల కేంద్రంగా చేస్తే అందిరికీ ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

– లక్ష్మి, సర్పంచ్

మండల కేంద్రం చేయాలి

ప్రస్తుతం ఉన్న మండల కేంద్రానికి, పోలీస్‌స్టేషన్‌కు 14 కిలోమీటర్ల దూరంలో చిన్నరేవల్లి ఉంది. దీంతో చిన్నరేవల్లిని మండల కేంద్రం చేయాలని గ్రామసభలో తీర్మానాలు చేసి సర్పంచ్, ఎంపీటీసీలు తదితరులు కలిసి ఇదివరకే ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, కలెక్టర్‌లతోపాటు ఇతర అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంతేకాకుండా మండల ఏర్పాటుకు కావాల్సిన వసతుల కోసం అవసరమైన భూమిని సైతం అందుబాటులో ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాఠశాల భవనం



గ్రామ పంచాయతీ భవనం

భక్తిశ్రద్ధలతో సామూహిక పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు, స్వాములు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం శివశక్తినగర్‌లోని శివాలయం ప్రాంగణంలో గురువారం అయ్యప్పస్వామి సామూహిక పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. శివశక్తి యువసేన అయ్యప్ప మాలాధారుల ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగిన అయ్యప్పస్వామి పడిపూజ వేడుకలో భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురుస్వాములు అన్మేష్, మనోహర్, పరిమళాచారి ఆధ్వర్యంలో పడిపూజ సాగింది. స్వామివారికి అభిషేకం, పదునెట్టాంబడి పూజలు చేశారు. అయ్యప్ప భక్తిగీతాలను ఆలపించారు. పూజ అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సామూహిక పడిపూజ వేడుకలకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, పద్మజారెడ్డి, పాండురంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు.